క్లుప్తంగా

యువ సాహితీ ప్రతిభా పురస్కారం


అవార్డు అందుకుంటున్న గౌరీనాయుడు

పిఠాపురం: సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళా రంగాల్లో తాను చేసిన కృషికి యువ సాహితీ ప్రతిభా పురస్కారం లభించినట్లు పట్టణానికి చెందిన యువ కవి, సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరీనాయుడు ఆదివారం తెలిపారు. శనివారం విశాఖపట్టణంలోని అంకితం వెంకటనరసింగరావు ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రాచకొండ నరసింహశర్మ సాహితీ సంస్థ అధ్యక్షుడు ఎంఎస్ నాయుడు, ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారిల చేతుల మీదుగా అవార్డు అందుకున్నానన్నారు. ఈ సందర్భంగా గౌరినాయుడిని సోమసుందర్ లిటరసీ ట్రస్టు కార్యవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

భగవద్గీతాలయంలో గీతా పారాయణం


గోవింద నామ పారాయణం, భక్తి లహరి నిర్వహిస్తున్న మహిళలు

పెద్దాపురం: స్థానిక సత్తిరెడ్డి పేట భగవద్గీతాలయంలో భగవద్గీత ప్రచార సేవా సమితి 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ఆదివారం గీతా పారాయణం, విష్ణు లలితా హనుమాన్ చాలిసా, గోవింద నామ పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మల్లికార్జున స్వామి గీతా పారాయణం ప్రవచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సత్యకుమార్, గోలి రాంబాబు, నేతి వీరభద్రరావు, జీవీకే మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత


విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరికి పింఛను అందిస్తున్న వలంటీరు గంగాధర్

తుని: సర్జరీ చేయించుకొని విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు ఆదివారం వలంటీరు పింఛను అందజేశాడు. స్థానిక 15వ వార్డు దుర్గాదాసువీధికి చెందిన సరిపల్లి హరి అనే మహిళ విజయవాడలో ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె సామాజిక పింఛను లబ్ధిదారు కావడంతో వార్డు కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ ఆదేశాల మేరకు వలంటీరు కేవీ గంగాధర్ సొంత ఖర్చులతో విజయవాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. వలంటీర్ గంగాధర్‌ను పలువురు అధికారులు అభినందించారు.

చికిత్స పొందుతూ మృతి

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామానికి చెందిన నడకిడిమిల్లి ధనరాజు వర్మ (18) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు చదువు మధ్యలో మానేసి పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ధనరాజు వర్మ శనివారం తూరంగి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో తండ్రి ధనరాజు ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు. ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఎన్నికల మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసి నవరత్న సంక్షేమ పథకాలు పేదలకు అందించిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి, రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలేనికి చెందిన మీసాల త్రినాథరావును కన్నబాబు అభినందిచారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబును త్రినాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

దోమల వృద్ధితో సీజనల్ వ్యాధులు


అమీనాబాద్‌లో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త


కొండెవరంలోని ప్రధాన రహదారిలో పూడుకుపోయిన డ్రైన్

జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

కొత్తపల్లి: మండలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తత అవసరమని వైద్యులు చెబుతున్నారు. డెంగీ, మలేరియా జ్వరాలు దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశముంది. ఈ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు నిల్వ నీటిలో పెరుగుతాయి. వీటి వృద్ధిని నియంత్రించాలంటే గృహ స్థాయిలో చిన్న చిన్న జాగ్రత్తలు పాటించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుష్మ సూచిస్తున్నారు.

వైద్యుల సూచనలివీ..

- ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరం, ఈడిస్ దోమలు కుట్టడం వల్ల డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు వస్తాయి. ఎక్కడైనా నీరు నిల్వ ఉండిపోతే అక్కడ దోమలు వాలి గుడ్లు పెడతాయి. ఒక దోమ 200 వరకూ గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లన్నీ వారం నుంచి 10 రోజుల్లో దోమలుగా వృద్ధి చెందుతాయి.
- నీటిని నిల్వ చేసిన గోళాలు, డ్రమ్ములు, వాటర్ ట్యాంకులు, సంపులు, ఫ్లవర్ వేజ్‌లు, రుబ్బు రోళ్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్సులు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీకప్పులు, ఐస్‌క్రీం కప్పుల్లో దోమలు వృద్ధి చెందుతాయి. అందుకే నివాసానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో నీటి నిల్వకు అవకాశముండే అనవసర వస్తువులను తొలగించుకోవడంతో పాటు వారానికోరోజు డ్రై డే పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, ట్యాంకులపై దోమలు చొరబడకుండా మూతలు పెట్టుకోవడం లేదా గుడ్డ చుట్టుకోవడమో చేయాలంటున్నారు.

తూటికాడతో సాగేదెలా?


సామర్లకోట గోదావరి కాలువలో పెరిగిపోయిన తూటికాడ

- సాగునీరు అందక రైతుల అవస్థలు
- 18,200 ఎకరాల్లో సాగుకు సమస్య

సామర్లకోట: స్థానిక సామర్లకోట గోదావరి కాలువలో తూటికాడ పెరిగిపోయింది. దాంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో మండల పరిధిలో 22,200 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. వీటిలో 90 శాతం వెదజల్లు పద్ధతిలో సాగు చేశారు. 18,200 ఎకరాల్లో గోదావరి కాలువపై ఆధారపడి సాగవుతోంది. దాళ్వా సీజన్‌లో 80 శాతం మంది రైతులు బొండాలను సాగు చేయగా 20 శాతం మాత్రమే సన్నాలను సాగు చేసిన్నట్లు మండల వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. సన్న రకం 120 నుంచి 130 రోజులలో పంట చేతికి వస్తుంది. అయితే బొండాలకు 150 రోజుల వరకు సమయం పడుతుందని అధికారులు చెప్తున్నారు. మార్చి నెలాఖరునాటికి గోదావరి కాలువ మూసివేసే పరిస్థితులు ఉండటం, సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి కాలువలో నీరు ప్రతి రైతుకు అందేలా వంతులు ఇవ్వడం జరిగింది. దాంతో వీకే రాయపురం రైతులకు సాగు నీరు అందడం లేదని రైతులు మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌కు సమస్య వివరిస్తాం



తూటికాడ, గుర్రపు డెక్క తొలగించాలని అధికారులకు సూచించాం. ఇప్పటికే రెండు సార్లు తొలగించామని, అందువల్ల ఉన్నతాధికారులు మరోసారి తొలగింపునకు అనుమతించలేదు. సోమవారం కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లి వివరిస్తాం. – ఐ.సత్య, ఎంపీటీ

పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు

కాకినాడ ఎంపీ వంగా గీత


ఎంపీ వంగా గీత

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరులో నిర్వహించిన సిద్ధం మహాసభ విజయవంతమవ్వడానికి కారకులైన వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత తెలిపారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడానికి నాయకులు, కార్యకర్తలు మళ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ స్ఫూర్తి నింపిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దేశంలోనే నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రజలకు అందించాలని చిత్తశుద్ధితో పని చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందిన ఏకైక నేత సీఎం వైఎస్ జగన్ ఒక్కరే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పేదలకు నేరుగా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

చిట్టిబాబు మృతికి నివాళులు

సామర్లకోట: మాజీ కౌన్సిలర్ పాడుగు చిట్టిబాబు పార్థివ దేహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆదివారం నివాళులు అర్పించారు. చిట్టిబాబు గుండెపోటుతో మృతి చెందిన వార్తను తెలుసుకుని బ్రౌన్‌పేట ఆర్‌సీఎం చర్చిలో నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్, మాజీ కౌన్సిలర్ మన్యం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక స్టేషన్ సెంటర్‌లో మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజుమాస్టారు ఆధ్వర్యంలో, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసు, ఎ వెంకట్రావు నివాళులర్పించారు.

మోటారు సైకిల్ మెకానిక్ దుకాణ యజమానుల కార్యవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కన్నారావు

సామర్లకోట: ఐక్యతతోనే సమస్యలు, డిమాండ్లు పరిష్కరించుకోగలమని మోటారు సైకిల్ మెకానిక్ దుకాణాల యజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి కన్నారావు అన్నారు. సామర్లకోట సంఘం 33వ సర్వసభ్య సమావేశం స్థానిక పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నాంజనేయ ఆలయం సమీపంలోని లే అవుట్‌లో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐక్యతతోనే ప్రభుత్వం నుంచి యూనియన్ కార్యాలయాన్ని సంపాదించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత కమిటీనే కొనసాగించాలని వారు నిర్ణయించారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా ఎండీ అనీఫ్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.సత్యనారాయణ, కార్యదర్శిగా అలక సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ఇందన రాము, సహాయ కార్యదర్శిగా తనుకు శ్రీను, కోశాధికారిగా నెల్లిపూడి శ్రీను, మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అనిఫ్ మాట్లాడుతూ మోటారు సైకిల్ మెకానిజంపై ఆధారపడి సుమారు 100 మంది పనిచేస్తున్నారని, తరచూ సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నామని, తమకు స్థలం కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.వెంకటరమణ, కాకినాడ అధ్యక్షుడు టి.సతీష్, ద్రాక్షారామం అధ్యక్షుడు పి.కృష్ణ, పెద్దాపురం అధ్యక్షుడు శ్రీను, గొల్లప్రోలు అధ్యక్షుడు మధు పాల్గొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.త్రినాథ్‌మూర్తిని, జిల్లా అధ్యక్షుడు కన్నారావులను యూనియన్ నాయకులు సత్కరించారు. మూడు జిల్లాల పరిధిలోని డీలర్లు మోటారు సైకిళ్ల విడిభాగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించండి


రాజకీయ పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న సర్పవరం సీఐ శ్రీనివాస్

- బూత్ స్థాయి రాజకీయ నాయకులతో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సమావేశం

కాకినాడ రూరల్: శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని బూత్ స్థాయిలో రాజకీయ పార్టీ నాయకులతో సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు. మండలంలో సర్పవరం, వాకలపూడి గ్రామాలలో పోలింగ్ స్టేషన్లు 86, 29 పరిధిలో ఆదివారం సాయంత్రం సమావేశాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ, ఇతర పార్టీలు నాయకులు సమావేశానికి హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాళ్లరేవు మండలం సుంకటరేవుకు చెందిన యువకుడు దడాల అమర్ తేజ (26) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసుల వివరాల ప్రకారం కాకినాడలో ఆస్పత్రికి అమర్ తేజ తన తండ్రి ఈశ్వరరావుతో మోటారు సైకిల్‌పై వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తండ్రి బైక్ నడుపుతుండగా వెనక అమర్ తేజ కూర్చున్నాడు. తూరంగిలో బాలయోగి విగ్రహానికి సమీపానికి వచ్చే సరికి ఒక్కసారిగా కుక్క బైక్‌కు అడ్డం రావడంతో ఇద్దరూ కింద పడిపోయారు. అమర్‌తేజ తలకు బలమైన గాయం కావడంతో జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భీష్మకుమార్ ఆదివారం తెలియజేశారు.

ఘనంగా తండులార్చన


ప్రత్తిపాడు శ్రీసత్యసాయి ఆలయంలో తండులార్చన చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: స్థానిక సత్యసాయి సేవా కేంద్ర భవన్‌లో ఆదివారం ఘనంగా శ్రీసత్యసాయి ఆలయంలో తండులార్చన (బియ్యంతో అర్చన) నిర్వహించారు. బాలబాలికలు, తల్లిదండ్రులు, సమితి సభ్యులు శ్రీసాయి గాయత్రి మంత్రాన్ని పఠిస్తూ తండ్రులార్చన చేశారు. బాలవికాస్ విద్యార్థిని స్వాతి గనిలక్ష్మి గాయత్రి మంత్రం విశిష్టతను వివరించింది. అనంతరం ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో జిల్లా బాల వికాస్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా విద్యాజ్యోతి కో ఆర్డినేటర్ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

భద్రాద్రికి శ్రీరామ రథ పాదయాత్ర


శ్రీరామ రథాన్ని ప్రారంభించిన వాసుదేవ గురుస్వామి దంపతులు

సామర్లకోట: ఏటా సామర్లకోట మండలం గొంచాల గ్రామం నుంచి కాలి నడకన భద్రాద్రికి తరలి వెళ్తున్న శ్రీరామ పాదయాత్రను ఆదివారం ప్రారంభించారు. వాసుదేవ గురుస్వామి (ఉంగరాల వీరవెంకటసుబ్బారావు) ఆధ్వర్యంలో భద్రచల శ్రీరామ రథోత్సవ పాదయాత్ర సమితి బృందం 400 మంది హనుమ దీక్ష పరులతో బయలు దేరారు. ఆదివారం ఉదయం కాకినాడ స్వయంభూ భోగి గణపతి పీఠంలో తొలిపూజ చేసి సామర్లకోట జాతీయ రహదారిపై భద్రాచలం తరలి వెళ్లారు. గురుస్వామి మాట్లాడుతూ 13వ వార్షిక యాత్ర 10 రోజుల్లో పూర్తి చేసి భారీ అన్న సమారాధన చేస్తామని చెప్పారు. టీటీడీ సౌజన్యంతో గొంచాల పంచాయతీ కల్పించిన స్థలంలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న రామాలయాన్ని ఏడాదిలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. యాత్రలో రోజుకు రూ.70వేల ఖర్చుతో ఉదయం, సాయంత్రం అల్పాహారం, భోజన వసతి ఏర్పాట్లను దాతలు అందిస్తున్నారన్నారు. 2012లో ఇద్దరితో ప్రారంభమైన యాత్ర ప్రస్తుతం 400 మందికి చేరిందన్నారు. పాదయాత్ర పెద్దాపురం ఏడీబీ రోడ్డు, సూరంపాలెం, దివాన్ చెరువు, ధర్మవరం, కొయ్యగూడెం, బయ్యనగూడెం, వేగవరం, వూటపల్లి, కుక్కునూరు, వేలేరు మీదుగా ఆంధ్రా నుంచి తెలంగాణ ప్రాంతానికి ఆరు జిల్లాల మీదుగా యాత్ర చేరుతుందని చెప్పారు. సమితి గౌరవ అధ్యక్షుడు వింటి బాబ్జీ, అధ్యక్షుడు పేర్నిడి వెంకటరమణ, వెంకటేశ్వరరావు తదితరులు యాత్రను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

గ్రూప్ 1, 2లకు ఉచిత శిక్షణలో ఎమ్మెల్సీలు


శిక్షణకు హాజరైన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన ఎమ్మెల్సీలు

సామర్లకోట: సామాజిక అంశాలపై గ్రూప్1, 2 ఉద్యోగార్థులు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఏపీపీఎస్సీకి దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు ఆదివారం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక సుగర్ ఫ్యాక్టరీ గెస్టు హౌస్ ఆవరణలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు. ఎంఎల్‌సీలు ముఖ్య అతిథులుగా పాల్గొని పరీక్షల అవగాహన కల్పించారు. ఒక ఉద్యోగానికి వెయ్యి మంది వరకు పోటీ ఉన్నారనే ఆలోచన మాని ఆ ఉద్యోగం నాకే వస్తుందనే ధీమాతో సిద్ధం కావాలన్నారు. ఫ్యాకల్టీలు తాతపూడి సుశీల్‌కుమార్, కాకర ముత్యాలరావు, వైబోగుల గోపాలకృష్ణ శిక్షణ నిర్వహించారు. అభ్యర్థులకు ట్రస్టు ఏర్పాటు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. సుమారు 200 మంది విద్యార్థులు శిక్షణ హాజరయ్యారు.

కిటకిటలాడిన సాగర తీరం


పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగర తీరం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగర తీరం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ స్వామినాయుడు తమ సిబ్బందితో కలిసి వాహనాలను క్రమబద్ధీకరించారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మ తల్లి లోవ అమ్మవారి దర్శించుకుని వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకుని సందడి చేశారు.

టీటీడీ చైర్మన్‌కు తపోవనం స్వామీజీ ఆశీస్సులు


టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందిస్తున్న తపోవనం పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

తుని రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ భూమాన కరుణాకర్‌రెడ్డిని మండలంలోని కుమ్మరిలోవలో తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆదివారం ఆశీర్వదించారు. ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ తిరుమలలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర ధార్మిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీ పాల్గొని ధర్మ ప్రచారంపై విస్తృతంగా చర్చలు నిర్వహించినట్టు తపోవనం పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి వేదాశీస్సులు అందజేసినట్టు స్వామీజీ పేర్కొన్నారు.

వ్యర్థాల నిర్వహణకు చురుగ్గా చర్యలు


స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది


సేకరించిన స్థలం వద్ద బోర్డు ఏర్పాటు చేసిన కార్పొరేషన్

- స్థలాన్ని అభివృద్ధి చేస్తున్న కార్పొరేషన్
- ఇది డంప్ యార్డు కాదన్న అధికారులు

కాకినాడ: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన వ్యర్థ, మురుగు నీటి జలాల నిర్వహణ దిశగా నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. వీటికోసం ఇటీవలే ఓ ప్రైవేటు సంస్థ నుంచి టీడీఆర్ బాండ్ల ద్వారా ఐదు ఎకరాల స్థలాన్ని సేకరించిన కార్పొరేషన్ ఇప్పుడు ఆ స్థలాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టింది. కార్పొరేషన్‌కు చెందిన హూపర్ టిప్పర్, జేసీబీలు వంటి వాహనాల కోసం వెహికల్ యార్డుతో పాటు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వ్యర్థజలాలను శుద్ధి చేసేలా ప్లాంట్ ఏర్పాటు, పొడిచెత్తను ప్రాసెసింగ్ చేసే విధానం వంటి కార్యకలాపాలను అక్కడ చేపట్టనున్నారు. ఆ మేరకు అవసరమైన యూనిట్లను ఏర్పాటు చేసే దిశగా తొలుత స్థలాన్ని చదును చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కాగా ఇక్కడ వ్యర్థాల నిర్వహణ మాత్రమే జరుగుతుందని, చెత్తను డంపింగ్ చేయబోరని అధికారులు స్పష్టం చేశారు. కాగా సేకరించిన స్థలం నగరపాలక సంస్థదిగా పేర్కొంటూ అక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం


రామవరం వద్ద రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శ్రీకారం చుట్టారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. మర్రిపాక–ఇర్రిపాక రోడ్డు నిర్మాణ పనులకు సంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 6 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఇర్రిపాక సర్పంచ్ తిర్రిదేవి, వైఎస్సార్ సీపీ నేతలు జ్యోతుల రామస్వామి, వత్సవాయి సత్యనారాయణరాజు, గణేశుల రాంబాబు, వంటిపల్లి రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.